క్లుప్తంగా

స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో భూ సమేత వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

ఉండ్రాజవరం: స్థానికంగా కొలువైన భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఏడు గంటలకు సంకల్పం, విష్వక్సేన పూజతో వేద పండితులు క్రతువులు ప్రారంభించారు. అనంతరం పుణ్యాహవచనం, దీక్షాధారణ, మూల విరాట్‌కు సంపూర్ణ అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు అగ్ని మథనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తు హోమం, ధ్వజారోహణ నిర్వహించారు. ధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాలను వీక్షించి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం సాయత్రం ఐదు గంటలకు స్వామి వారి కల్యాణం నేత్ర పర్వంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జ్ఞాన సరస్వతి గుడిలో చండీ హోమం



చండీ హోమం చుట్టూ భక్తుల ప్రదర్శనలు

కొవ్వూరు: జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా శనివారం స్థానిక గోష్పాద క్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన చేశారు. స్థానిక భక్తులు పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సీహెచ్ సుబ్రహ్మణ్యం, గంప కృష్ణారావు, ఆత్మీయ హితకారణి సమాజం సభ్యులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షురాలిగా అరుణకుమారి

కొవ్వూరు: జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలిగా అరిగెల అరుణకుమారిని కొనసాగిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 20వ తేదీ వరకూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రశాఖలో ఉన్న అన్ని కమిటీలను రద్దు చేసినట్టు ప్రకటించారు. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకూ ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ కమిటీ వ్యవహారాలకు బాధ్యురాలిగా ఉన్న అరుణకుమారిని కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ ఎన్ రాజా ఉత్తర్వులు పంపారని అరుణకుమారి తెలిపారు.

వృద్ధాశ్రమానికి వీల్ చైర్ అందజేత



వీల్‌చైర్ అందజేస్తున్న రోటరీ సభ్యులు

నిడదవోలు: స్థానిక చర్ల సుశీల వృద్ధాశ్రమంలోని వృద్ధుల అవసరాల మేరకు రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం వీల్ చైర్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్ గౌడ్, సీహెచ్ ఫణి శారద, మాచర్ల మధుసూదదరావు, చైన్లు రాజా, గొనేల వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నల్లజర్ల: జనసేన పార్టీ దూబచర్ల గ్రామ శాఖ అధ్యక్షుడు తాడిగడప శ్రీను ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆ కుటుంబానికి జన సైనికులు శనివారం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టొడ్డిగర్ల సువర్ణరాజు, జిల్లా కార్యదర్శి అచ్యుత సత్యనారాయణ, పురెళ్ల సత్యనారాయణ, గుడిశే కృష్ణ, రుద్రా శ్రీను, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, శివకాల సురేష్, పురెళ్ల బాలకృష్ణ, లక్కోజు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

డెల్టా కాలువలకు నీటి విడుదల పెంపు

నిడదవోలు: ఖరీఫ్ సాగు అవసరాల కోసం పశ్చిమ డెల్టా కాలువలకు జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్ వర్క్స్ అధికారులు 4,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు శనివారం నీటి విడుదలను పెంచారు. గోదావరి డెల్టాల పరిధిలో సాగు, తాగు నీటి అవసరాల మేరకు ఉప కాలువలకు కూడా క్రమంగా నీటి విడుదలను పెంచుతున్నారు. డెల్టా శివారు భూములకు నీటిని అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గోదావరి నీటి మట్టం ప్రస్తుతం 13.23 మీటర్ల వద్ద ఉంది. పశ్చిమ డెల్టా పరిధిలో ఏలూరు కాలువకు 827, తణుకు కాలువకు 662, నరసాపురం కాలువకు 1220, అత్తిలి కాలువకు 270, ఉండి కాలువకు 1106 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నామినేటెడ్ పదవులకు పైరవీలు

- గోపాలపురం ఏఎంసీ కుర్చీ కోసం యత్నాలు
- దేవస్థానాల ట్రస్ట్ బోర్డుల పాలకవర్గాల ఏర్పాటుకు కసరత్తు

దేవరపల్లి: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువు తీరడంతో నామినేటెడ్ పదవుల కోసం అధికార తెలుగుదేశం పార్టీ నేతలు పైరవీలు చేపట్టారు. పదవులు ఆశిస్తున్న పలువురు నాయకులు వారం రోజులుగా తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులకు పదవుల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని వారు పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నారు. ప్రధానంగా గోపాలపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై నేతల కన్ను పడింది. ఏఎంసీ కుర్చీ కోసం పలువురు టీడీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. గోపాలపురం మండలానికి చెందిన ఒక నాయకుడు ఇప్పటి నుంచే ఆ పదవి కోసం తన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తన అనుచరులతో కలసి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుతో ఇప్పటికే చర్చించినట్టు సమాచారం. అలాగే ప్రముఖ దేవస్థానమైన ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి వారి ట్రస్ట్ బోర్డు పాలకమండలి సభ్యులు, నియోజకవర్గంలోని పలు దేవస్థానాల పాలకవర్గాల నియామకంపై అధికారులు కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. ఇప్పటి వరకూ పదవులు నిర్వహించిన పాలకవర్గాలు తమ పదవులకు రాజీనామాలు సమర్పించడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. టీడీపీ నేతలతో పాటు జనసేన, బీజేపీ నాయకులు కూడా పదువులు ఆశిస్తున్నారు. ఏఎంసీ చైర్మన్ పదవిని జనసేన నియోజకవర్గ నాయకుడు డి.సువర్ణరాజు ఆశిస్తున్నట్టు చర్చ జరుగుతోంది. దీంతో టీడీపీ, జనసేన నాయకుల మధ్య పోటీ నెలకొంది.

ఇదీ పరిస్థితి

గోపాలపురం మార్కెట్ కమిటీ 1997లో ఏర్పడింది. తొలి చైర్మన్‌గా గోపాలపురం మండలానికి చెందిన టీడీపీ నాయకుడు సున్న వెంకట మోహన్‌రావు పని చేశారు. అనంతరం ప్రభుత్వాలు మారడంతో దేవరపల్లి మండలానికి చెందిన గడా మురళీ అజీత్ కుమార్, కేవీకే దుర్గారావు, నరహరిశెట్టి రాజేంద్ర బాబు, ముళ్లపూడి వెంకట్రావు, ముమ్మిడి వీరవెంకట సత్యనారాయణ, గన్నమని జనార్దనరావులు చైర్మన్లుగా పనిచేశారు. ముళ్లపూడి వెంకట్రావు పాలనలో మార్కెట్ యార్డుకు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు వచ్చింది. ఆదాయం భారీగా పెరగడంతో ఉత్తమ మార్కెట్ కమిటీగా ప్రభుత్వం నుంచి అవార్డు కూడా దక్కింది. రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకొనేందుకు గిడ్డంగుల నిర్మాణం, నిమ్మకాయల మార్కెట్ ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన ప్లాట్‌ఫాం నిర్మించారు. దీంతో పాటు పశువుల మార్కెట్ కూడా ఏర్పాటు చేశారు.

1997లో మార్కెట్ కమిటీ ఏర్పాటు

గోపాలపురం నియోజకవర్గం కొవ్వూరు మార్కెట్ కమిటీలో అంతర్భాగంగా ఉండేది. ఇక్కడి రైతులు కొవ్వూరు వెళ్లి తమ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకోవలసి వచ్చేది. 1997లో కొవ్వూరు నుంచి గోపాలపురం నియోజకవర్గాన్ని వేరు చేసి గోపాలపురం మార్కెట్ కమిటీని ఏర్పాటు చేశారు. గోపాలపురం, దేవరపల్లి, తాళ్లపూడి మండలాలు ఈ ఏఎంసీ పరిధిలో ఉండేవి. 2021లో తాళ్లపూడి మండలాన్ని తొలగించి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాలను కలిపారు. నియోజకవర్గం ఒక యూనిట్‌గా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి



గోపాలపురంలోని ఏఎంసీ కార్యాలయం

సంవత్సరం	ఆదాయం(రూ.కోట్లలో)
2019-20	2.02
2020-21	78.93 (లక్షలు)
2021-22	2.31
2022-23	2.63
2023-24	3.71
మొత్తం	11.47

ఇప్పటి వరకూ పని చేసిన చైర్మన్లు ఎక్కువ మంది దేవరపల్లి మండలానికి చెందిన వారే. ఏడుగురు చైర్మన్లుగా పనిచేయగా, వారిలో ఆరుగురు దేవరపల్లి మండలం నుంచి నియమితులయ్యారు. ఈ సారి గోపాలపురం మండలానికి ప్రాధాన్యం ఇవ్వాలని టీడీపీ నేతలు గట్టిగా పట్టు పడుతున్నట్టు తెలుస్తోంది.

మూడు చెక్‌పోస్టుల ఏర్పాటు

గోపాలపురం, నల్లజర్ల, యర్నగూడెంలలో ఈ మార్కెట్ కమిటీ తరఫున చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వ్యవసాయ ఉత్పత్తులపై సెస్ వసూలు చేసి మార్కెట్ కమిటీ ఆదాయాన్ని సమకూర్చుతున్నారు. 2019 నుంచి 2024 వరకూ మార్కెట్ కమిటీకి వచ్చిన ఆదాయ వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

వసూలైన సెస్ ప్రభుత్వానికి జమ



మార్కెట్ కమిటీ పరిధిలోని మూడు చెక్ పోస్టుల ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల నుంచి సెస్ వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేస్తున్నాం. ఐదేళ్లుగా సెస్ ద్వారా రూ.11.47 కోట్ల ఆదాయం వచ్చింది. సెస్ నిధులతో లింక్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఆమోదం రావలసి ఉంది. మే నెలలో పాలకవర్గం పదవీకాలం పూర్తయింది. పర్సన్ ఇన్‌చార్జిల నియామకం జరగవలసి ఉంది. ద్వారకాతిరుమల, గోపాలపురం యార్డుల్లో నిమ్మకాల విక్రయాలు జరుగుతున్నాయి.

– ఎన్‌వీవీ సత్యనారాయణ, కార్యదర్శి, ఏఎంసీ గోపాలపురం

నేడు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



లయన్స్ క్లబ్ కొవ్వూరు నూతన కార్యవర్గం

కొవ్వూరు: లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం సాయంత్రం మూడు గంటలకు పట్టణంలో యువరాజ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నట్టు ఆ క్లబ్ నూతన అధ్యక్షుడు మద్దిపాటి వీర వెంకట సత్యనారాయణ శనివారం తెలిపారు. కార్యదర్శిగా నామన బుల్లి రాజు, కోశాధికారిగా నాళం వీర వెంకట శ్రీనివాస రావు ఎన్నికైన నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో పాటు లయన్స్ క్లబ్ పూర్వపు డిస్ట్రిక్ గవర్నర్ కొత్తపల్లి రవికుమార్ హాజరు కానున్నట్టు చెప్పారు.

అవార్డు గ్రహీత సీతారామ్‌కు సన్మానం



అవార్డు గ్రహీత కసిరెడ్డి సీతారామ్‌ను సత్కరిస్తున్న శివసాయి ధామం సభ్యులు

కొవ్వూరు: అమలాపురానికి చెందిన గారపాటి వీర్రాజు మెమోరియల్ ట్రస్టు నుంచి ఉత్తమ సేవా అవార్డు స్వీకరించిన కొవ్వూరు శివసాయి ధామం అధ్యక్షుడు కసిరెడ్డి సీతారామ్‌ను ఆ సంఘ సభ్యులు శనివారం కొవ్వూరులో ఘనంగా సత్కరించారు. గోష్పాద క్షేత్రంలోని శివసాయి ధామం కార్యాలయంలో సీతారామ్ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. శివసాయి ధామం ఉపాధ్యక్షుడు పరిమి రాజేష్, కార్యదర్శి రెడ్డి తాతయ్యబాబు, కోశాధికారి నగళ్లపాటి శ్రీనివాస్, సభ్యులు కోట్ల సత్యనారాయణ, చలపాక గణేష్, నారా సుబ్రహ్మణ్యం, ర్యాలి శివబాల సుబ్రహ్మణ్యం తదితరులు సీతారామ్‌ను సత్కరించిన వారిలో ఉన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

- జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు
- చాగల్లు జెడ్పీహైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీ

చాగల్లు: ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని పెట్టుకొని కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కె.వాసుదేవరావు అన్నారు. ఆయన శనివారం చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పలు అంశాలు పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. ఈ సందర్భంగా ఆయన టెన్త్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షలకు ముందు మాత్రమే చదివితే ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఏరోజు పాఠాలను ఆరోజు శ్రద్ధగా చదువుకుని అవగాహన పెంచుకుంటే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

అనంతరం 9వ తరగతిలోని 21 మంది విద్యార్థులతో డీఈఓ వాసుదేవరావు పాఠాలు చదివించారు. వారిలో కొందరు సక్రమంగా చదవలేకపోవడాన్ని గుర్తించిన డీఈఓ వారికి గతేడాది 8వ తరగతి పాఠాలు బోధించిన ఉపాధ్యాయుడ్ని పిలిపించి ప్రశ్నించారు. ఆ తరువాత పాఠశాల్లోని ఉపాధ్యాయులతో డీఈఓ సమావేశం నిర్వహించారు. పేద విద్యార్థుల చదువుకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నందున, ఆ విద్యార్థులను మన పిల్లలుగా భావించి, చదువు చెప్పాలని సూచించారు. ఏడుగురు ఉపాధ్యాయులు బయోమెట్రిక్ అటెండెన్స్ ఆలస్యంగా వేయడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. ప్రతి ఉపాధ్యాయుడూ నిబద్ధతతో పని చేయాలని, అలసత్వాన్ని సహించబోనని హెచ్చరించారు. మధ్యాహ్న భోజనంలో రాగి జావను డీఈఓ వాసుదేవరావు స్వయంగా రుచి చూసి సరిగా తయారు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం నిర్వహణ తీరును రోజూ పర్యవేక్షించాలని హెచ్‌ఎంను ఆదేశించారు. పాఠశాల రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా సీఎంఓ శ్రీనివాసరావు, ఎంఈఓ యు.గురునాథం, ఎంఈ ఓ -2 శుభాకర్ పాల్గొన్నారు. అనంతరం డీఈఓ ధారవరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేసిన ప్రహరీని పరిశీలించారు. మండల విద్యాశాఖాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



చాగల్లు హైస్కూల్లో రాగి జావను పరిశీలిస్తున్న డీఈవో వాసుదేవరావు



కూల్చి వేసిన ధారవరంలో పాఠశాల ప్రహరీని పరిశీలిస్తున్న డీఈవో వాసుదేవరావు

దాత సాయంతో పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పొందిన విద్యార్థులతో దాత కుంకట్ల వెంకటరత్నం, హెచ్‌ఎం ప్రసాద్

ఉండ్రాజవరం: మండలంలోని మోర్త ప్రాథమిక పాఠశాల నంబర్-2 విద్యార్థులకు శనివారం యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కుంకట్ల వెంకటరత్నం చేతుల మీదుగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు తెలుగు కాపీ, ఇంగ్లిషు కాపీ, డబుల్ రూల్ బుక్‌లు, వైట్ పేపర్స్, సింగిల్ రూల్స్ బుక్స్, పలకలను దాత కుంకట్ల వెంకటరత్నం ఆర్థిక సహకారంతో అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరత్నంకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎల్‌వీ ప్రసాదరావు, ఉపాధ్యాయిని కే.బేబీ లక్ష్మి పాల్గొన్నారు.

శారీరక మార్పులపై అవగాహన అవసరం

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సంధ్య
- టీనేజీలో వచ్చే మార్పులపై విద్యార్థినులకు అవగాహన

నల్లజర్ల: తమ శరీరంలో వచ్చే మార్పులపై కిశోర బాలికలు అవగాహన పెంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సంధ్య సూచించారు. ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నల్లజర్ల జెడ్పీ హైస్కూల్లోని విద్యార్థినులకు టీనేజీలో వచ్చే మార్పులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సంధ్య మాట్లాడుతూ నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత గురించి విద్యార్థినులకు వివరించారు. రుతుక్రమం అనేది సహజ ప్రక్రియ అని దీనిపై కిశోర బాలికలు, మహిళలు ఆందోళన చెందకుండా, అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సమయంలో వచ్చే కడుపు నొప్పికి డాక్టర్ సలహా మేరకు మందులు వాడాలన్నారు. ఈ సమయంలో విశ్రాంతితో పాటు ఐరన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 175 మంది విద్యార్థినులకు శానిటరీ నేప్‌కిన్స్‌ను ఆమెన్ ట్రస్ట్ అధ్యక్షులు ఇవాంజలిన్ అశోక్, డాక్టర్ సంధ్య అందజేశారు. ఆమెన్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమలను డాక్టరు సంధ్య అభినందించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం కోమలీ చిత్ర, నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ గంగాధరరావు, ఆరోగ్య పర్యవేక్షకులు అన్నమ్మ, సత్యనారాయణ, సహాయకులు కొక్కిరపాటి సుబ్బారావు, తూంపాటి రాఘువేంద్రరావు, జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థినులకు శానిటరీ నేప్‌కిన్స్ అందిస్తున్న డాక్టర్ సంధ్య

అనంతపల్లిలో మలేరియా వ్యతిరేక ర్యాలీ

నల్లజర్ల: వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలే ముప్పు ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది అనంతపల్లి గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా పోతవరం పీహెచ్‌సీ పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. దాదాపు అన్ని గ్రామాల్లోనూ వర్షాలు కురుస్తున్నందున, పల్లెల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూసుకోవాలన్నారు. లేకుంటే దోమలు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. వ్యాధులు బారిన పడకుండా ఎవరికి వారే స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, ఖాళీ నీటి తొట్టెలు, టైర్లు, కొబ్బరి బొండాలలో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. అనాఫిలిస్ అనే ఆడదోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి వ్యాపిస్తుందన్నారు. ఈ వ్యాధి సోకితే చలి,జ్వరం, విపరీతమైన తలనొప్పి వంటి లక్షణాలు ఉంటాయన్నారు. రోగులకు సమీప ఆరోగ్య కేంద్రాల్లో రక్త పరీక్షలు చేస్తారని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ ఇందిర, ఎంపీహెచ్ఓ సత్యం, హెచ్‌ఎస్ సత్యం, హెచ్‌వీ మీరా, ఎంపీహెచ్ఓలు శ్యామ్, సంధ్య, ఏఎన్‌ఎంలు గౌతమి, దీప్తి, పంచాయతీ కార్యదర్శి ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.



అనంతపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య,ఆరోగ్య సిబ్బంది

వివాహిత ప్రాణాలు కాపాడిన ఎస్సై

గోపాలపురం: పదేళ్ల బాలిక సమయస్ఫూర్తి, స్థానిక ఎస్సై సేవాగుణం ఓ మహిళ ప్రాణాన్ని కాపాడాయి. వివరాలిలా ఉన్నాయి. గోపాలపురం మండలంలోని వేళ్లచింతలగూడెం గ్రామానికి చెందిన వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో శనివారం నీటిలో చీమల మందు కలుపుకుని తాగేసింది. అపస్మారక స్థితిలో ఉన్న తల్లిని చూసిన ఆమె పెద్ద కూతురు గ్రామంలోని పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న చెల్లెలి వద్దకు వెళ్లి జరిగిన విషయం చెప్పింది. దీంతో చిన్న కూతురు పాఠశాల నుంచి నేరుగా ఇంటికి వెళ్లకుండా వేళ్లచింతలగూడెం నుంచి పరుగు పరుగున గోపాలపురం పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన తల్లి పరిస్థితి గురించి ఎస్సై కె.సతీష్‌కుమార్‌కు వివరించింది. దీంతో ఎస్సై తన సిబ్బందితో హుటాహుటిన వేళ్లచింతలగూడెం వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న ఆ వివాహితను పోలీసు వాహనంలో ఎక్కించుకొని గోపాలపురం కమ్యూనిటీ ఆసుపత్రికి హుటాహుటిన చేర్చారు. అక్కడి వైద్యుల కృషితో ఆమె ప్రాణాపాయం నుంచి బయట పడింది. ఆ బాలికను, ఎస్ఐను పలువురు అభినందించారు.

ఎనిమిది మద్యం సీసాలతో ఒకరి అరెస్ట్

దేవరపల్లి: ఎస్ఈబీ దేవరపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని సుబ్బరాయపురంలో శనివారం దాడి చేసినట్టు సీఐ కేవీ స్వామి తెలిపారు. ఈ దాడిలో ఒక వ్యక్తి నుంచి ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. దాడుల్లో ఎస్సై పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.

పోస్టులను భర్తీ చేయాలి

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాలలో కొన్నేళ్లుగా రెగ్యులర్ అధ్యాపక పోస్టులను భర్తీ చేయట్లేదని, దీంతో అతిథి అధ్యాపకులపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. దీంతో విద్యార్థులకు నా ణ్యమైన విద్య దూరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా చోరీ

రూ.1.40 లక్షల నగదు, గ్రాము బంగారం, స్కూటీ చోరీ

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం సంగాలమ్మ ఆలయం వీధిలోని ఓ ఇంట్లో కుటుంబ సభ్యులందరూ నిద్రిస్తుండగా శుక్రవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, బాధితుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ గ్రామానికి చెందిన అలజింగి అసిరియ్య నిడదవోలులో బార్బర్ షాపు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులంతా కలిసి ఇంటి కింద గదులకు తాళం వేసి పై అంతస్తులోని గదిలో నిద్రపోయారు. అసిరియ్య శనివారం తెల్లవారుజామున 5 గంటలకు నిద్రలేచి చూసేసరికి ఇంటి తలుపుల తాళాలు పగలగొట్టి ఉండడంతో ఆందోళన చెందారు. గది లోపల బీరువాలో పెట్టిన రూ.1.40 లక్షల నగదుతో పాటు గ్రాము బంగారపు ఉంగరం, వరండాలో పెట్టిన హోండా యాక్టివ్ స్కూటీ చోరీకి గురయ్యాయి. దీనిపై అతడు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రమేష్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. అప్పు తీర్చేందుకు ఇంట్లో పెట్టిన నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.



సమిశ్రగూడెంలో చోరీ ఘటనపై బాధితుల నుంచి వివరాల సేకరిస్తున్న పోలీసులు

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి

నిడదవోలు రూరల్: ఉపాధి కూలీలకు 50 రోజులుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని సమిశ్రగూడెంలో ఉపాధి హామీ పనులను ఐఎఫ్‌టీయూ బృందం సభ్యులు శనివారం పరిశీలించారు. పనుల చేస్తున్న కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పనులు 200 రోజులకు పెంచాలని కోరుతూ కూలీలు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ జిల్లా కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు, ఐఎఫ్‌టీయూ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.



సమిశ్రగూడెంలో నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, ఉపాధి కూలీలు

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టండి

చాగల్లు: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో ఎస్.బుజ్జి ఆదేశించారు. మండలంలోని పంచాయతీ అధికారులతో శనివారం ఆమె మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష జరిపారు. సమావేశంలో ఎంపీడీవో బుజ్జి మాట్లాడుతూ వర్షాకాలంమొదలైనందున మురుగు నీరు రోడ్ల పైన, డ్రైనేజీల్లో నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లోని మంచి నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని, తాగు నీటిని వృథాను నివారించాలని, వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్త సేకరణకు, అంటువ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఆదేశించారు. ఈవోపీఆర్‌డీ ఆర్.శ్రావణ్‌కుమార్, డాక్టర్ టి.మనోజ్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఫొటోగ్రాఫర్ల ఫిర్యాదు

గోపాలపురం: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన తమకు రావాల్సిన బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలంటూ మండలంలోని ఫొటోగ్రాఫర్లు శనివారం గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు 20 మంది ఫొటోగ్రాఫర్లం రాత్రీ పగలూ అనే తేడా లేకుండా పని చేశామని అందుకు తమకు రావాల్సిన సుమారు రూ.20 లక్షలు తహసీల్దార్ డి. వనజాక్షి ఇంత వరకూ చెల్లించలేదన్నారు. పైగా తనకేమీ తెలియదంటూ ఆమె పొంతన లేని సమాధానం చెబుతున్నారని ఫొటోగ్రాఫర్లు వాపోయారు. అక్కడితో ఊరుకోకుండా ఫొటోగ్రాఫర్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద టెంట్ వేసి రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దాంతో ఎస్సై సతీష్‌కుమార్ ఫొటోగ్రాఫర్లకు నచ్చజెప్పారు. తహసీల్దార్ వనజాక్షితో ఎస్సై ఫోన్‌లో సంప్రదించారు. రెండు రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఫొటోగ్రాఫర్లు శాంతించారు.



గోపాలపురంలో ఎస్సై సతీష్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఫొటోగ్రాఫర్లు